సాక్షి
తిరుపతి
శుక్రవారం। 5। జనవరి। 2024



సంక్షేమ సారథికి మళ్లీ..
సంక్షేమ సారథి, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మళ్లీ పట్టం కడుదామని మంత్రి పెద్దిరెడ్డి పిలుపునిచ్చారు. - 8లో



నేడు సాధికార యాత్ర
వెంకటగిరిలో శుక్రవారం సామాజిక సాధికార బస్సు యాత్ర నిర్వహించనున్నారు. - 8లో



తోడేళ్లు వస్తున్నాయ్ జాగ్రత్త
మునుగు వేసుకున్న తోడేళ్లు వస్తున్నాయ్.. ప్రజలు జాగ్రత్తగా ఉండాలని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య సూచించారు. - 8లో

న్యూస్‌రీల్

7 నుంచి నీరాటోత్సవాలు

తిరుపతి కల్చరల్: శ్రీగోవిందరాజస్వామి వారి ఆలయంలో ఈనెల 7 నుంచి 13వ తేదీ వరకు శ్రీఆండాళ్ అమ్మవారి నీరాటోత్సవాలు జరగనున్నాయి. ఈ ఉత్సవాల సందర్భంగా 5వ తేదీ శుక్రవారం నాడు శ్రీగోవిందరాజస్వామి వారిని రామచంద్రకట్టపైకి వేంచేపు చేయనున్నారు. ఆండాళ్ అమ్మవారి నీరాటోత్సవాల ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు స్వామి వారు ముందుగా ఊరేగింపుగా వెళ్లడం ఆనవాయితీ. సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు ఈ కార్యక్రమం జరగనుంది.

7న సాంస్కృతిక పోటీలు

తిరుపతి కల్చరల్: వివేకానంద స్వామి జయంతి సందర్భంగా ప్రతి ఏటా నిర్వహించే జాతీయ యువజనోత్సవాల్లో భాగంగా ఈనెల 7వ తేదీన సాంస్కృతిక పోటీలు నిర్వహించనున్నట్టు సెట్విన్ సీఈఓ డాక్టర్ వీ.మురళీకృష్ణ తెలిపారు. ఈ పోటీలు శ్రీపద్మావతి మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతాయన్నారు. జానపద నృత్యం, ఫోక్ సాంగ్ గ్రూపు, వ్యక్తిగతంగా పోటీలలో పాల్గొనేందుకు 16 నుంచి 29 ఏళ్ల వయస్సు గల వారు అర్హులన్నారు. విజేతలకు శ్రీవివేకానందస్వామి జయంతి నాడు జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలు అందజేయనున్నట్టు వెల్లడించారు. వివరాలకు కార్యాలయం పనివేళల్లో 0877-2286921, 9848543976లో సంప్రదించవచ్చని సూచించారు.

సంక్రాంతి వేడుకల్లో అమ్మవారికి ముత్యాల చీర



భక్తులు సమర్పించిన ముత్యాల చీర, కిరీటం

రేణిగుంట (శ్రీకాళహస్తి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో శ్రీజ్ఞాన ప్రసూనాంబ అమ్మవారికి సంక్రాంతి వేడుకల్లో ముత్యాల చీర, కిరీటం, వడ్డాణం అలంకరించనున్నట్లు పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు తెలిపారు. బుధవారం హైదరాబాద్‌కు చెందిన దాతలు రవి, గాయత్రి తమ కుమార్తె పేరుపై అమ్మవారికి రూ.25 లక్షల విలువ చేసే ముత్యాలతో పొదిగిన చీర, వడ్డాణం, హస్తం, పాదాలు ఇచ్చిన విషయం తెలిసిందే. దీనిపై గురువారం ఆలయ చైర్మన్ సోమ, శుక్రవారాలతోపాటు ఇకపై ప్రతి మంగళవారం అమ్మవారికి ముత్యాల చీరను అలంకరిస్తామని తెలిపారు.

స్విమ్స్‌లో ఉద్యోగాలు

తిరుపతి(అలిపిరి): శ్రీ లక్ష్మీ శ్రీనివాస మ్యాన్ పవర్ కార్పొరేషన్ సంస్థ ఆధ్వర్యంలో స్విమ్స్ హాస్పిటల్‌లో పొరుగు సేవల ప్రాతిపదికన ఈసీజీ టెక్నీషియన్, బయోమెడికల్ ఇంజినీర్, రీసెర్చ్ సహాయకుల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కార్పొరేషన్ సీఈఓ శేష శైలేంద్ర గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 12వ తేదీ సాయంత్రం 4 గంటలలోపు జీఎం (జనరల్ మైంటనన్స్), స్విమ్స్ కార్యాలంలో దరఖాస్తులు అందించాలని తెలిపారు. ఈనెల 24న ఉదయం 10.30 గంటలకు రాత, మౌఖిక పరీక్షకు హాజరు కావాలని సూచించారు. దరఖాస్తు, చిరునామా, ఉద్యోగ, అర్హత, జీత భత్యాల వివరాలకు కార్పొరేషన్ వెబ్ సైట్ http://slsmpc.in/ను సంప్రదించాలని కోరారు.

108లో ఉద్యోగాల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

శ్రీకాళహస్తి: అరబిందో ఎమర్జెన్సీ మెడికల్ సర్వీసెస్ 108లో ఉద్యోగాల భర్తీ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తిరుపతి డివిజన్ ఓఈ సీ.శ్రీనివాసులు తెలిపారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. తిరుపతి జిల్లాలో తొట్టంబేడు, శ్రీకాళహస్తి, ఏర్పేడు, రేణిగుంట, తిరుపతి, వడమాలపేట, సూళ్లూరుపేట, చిట్టమూరు మండలాల్లో 108 సర్వీస్‌లో డ్రైవర్లుగా పనిచేసేందుకు ఆసక్తిగల వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పదో తరగతి ఉత్తీర్ణత సాధించి, హెవీ లైసెన్స్ కలిగిన వారు అర్హులని తెలిపారు. వివరాలకు 7032382246లో సంప్రదించాలని ఆయన కోరారు.

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 2 కంపార్ట్‌మెంట్లు నిండాయి. బుధవారం అర్ధరాత్రి వరకు 65,514 మంది స్వామివారిని దర్శించుకోగా 20,394 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ. 3.31 కోట్లు సమర్పించారు. టైం స్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 8 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

ఆరోగ్య సురక్ష.. అద్వితీయం

'పేదలకు కార్పొరేట్ స్థాయిలో వైద్యం అందాలి. రోగాలబారిన పడకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలి. అందరికీ ఆరోగ్యం అందించాలి. రక్తహీనత, కంటి సమస్యలను తగ్గించాలి. దీర్ఘకాలిక వ్యాధులపై నిరంతరం పర్యవేక్షణ ఉండాలి. రవాణా ఖర్చులను తగ్గించాలి. పల్లెముంగిటకే వైద్యసేవలు చేరుకోవాలి. వ్యాధులపై అవగాహన కల్పించాలి' అన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగానే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇప్పటికే మొదటి విడత దిగ్విజయంగా పూర్తిచేసింది. రెండో విడత కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో జగనన్న సురక్ష రెండో విడత కార్యక్రమంపై 'సాక్షి' స్పెషల్ ఫోకస్..

సురక్ష శిబిరంలో ఆరోగ్యశ్రీ కార్డు పంపిణీ చేస్తున్న డీఎంహెచ్‌ఓ శ్రీహరి



జగనన్న క్యాంపులో కంటి అద్దాలు పంపిణీని పరిశీలిస్తున్న చిత్తూరు డీఎంహెచ్‌ఓ ప్రభావతీదేవి





- ప్రతిష్టాత్మకంగా జగనన్న ఆరోగ్య సురక్ష
- విజయవంతంగా మొదటి విడత పూర్తి
- రెండో విడత సురక్షకు విశేష స్పందన
- ఇంటి ముంగిటకే వైద్య సేవలు

చిత్తూరు రూరల్: అందరికీ ఆరోగ్యమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అడుగులు వేస్తున్నారు. పేదల ఆరోగ్య పరిరక్షణకు పెద్ద పీట వేస్తున్నారు. మెరుగైన వైద్యం అందించేలా తపిస్తున్నారు. పల్లె ముంగిటకే ఆరోగ్య సేవలు తీసుకెళ్లాలన్న ఉద్దేశంతో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి పురుడు పోశారు. మొదటి విడతలో ఇది అద్భుత ఫలితాలివ్వడంతో రెండో విడత కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ముమ్మరంగా వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నారు. రోగులకు ఇంటి వద్దే వైద్యపరీక్షలు చేసి మెరుగైన వైద్యం అందిస్తున్నారు. దీనిపై పలువురు సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మొదటి విడతలో...

గత సెప్టెంబర్ 15వ తేదీన ఉమ్మడి చిత్తూరు జిల్లాలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇంటింటా వలంటీర్లు, వైద్య సిబ్బంది సర్వే చేపట్టారు. అనారోగ్య సమస్యలు ఉన్నవారికి వైద్య పరీక్షలు చేశారు. గ్రామాల్లోనే హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేసి మెరుగైన చికిత్స అందించారు. ఇలా జిల్లాలో నవంబరు వరకు కార్యక్రమం కొనసాగింది. ఇందులో భాగంగా 1,82,919 మంది వైద్య సేవలు పొందారు. డాక్టర్లు పల్లె, వార్డు బాట పట్టడంతో జనానికి ఇంటి పట్టునే సేవలందాయి. పలు రకాల వ్యాధులు బయటపడ్డాయి. దీంతో వారు ఆస్పత్రులకు వెళ్లి చికిత్స తీసుకుంటున్నారు.

రెండో విడత..

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో జనవరి 2 నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష-2 ప్రారంభించారు. సాధారణ జబ్బులతో పాటు దీర్ఘకాలిక వ్యాధులను వైద్యులు జల్లెడ పడుతున్నారు. ప్రతి మంగళ, శుక్రవారాల్లో గ్రామీణ ప్రాంతాల్లోనూ ప్రతి బుధవారం అర్బన్ ప్రాంతాల్లోనూ సురక్ష క్యాంపులు నిర్వహిస్తున్నారు. సాధారణ జబ్బులతో పాటు దీర్ఘకాలిక వ్యాధులు అంటే.. మధుమేహం, రక్తపోటు, క్యాన్సర్, మూర్ఛ, గుండె జబ్బులు లాంటివి ఏవైనా ఉంటే గుర్తించి మెరుగైన వైద్యం కోసం పెద్దాస్పత్రులకు రెఫర్ చేస్తున్నారు. ఆరోగ్యశ్రీ ద్వారా ఉచిత వైద్యసేవలు అందిస్తున్నారు.

స్పెషలిస్టులతో వైద్యం

జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులతో ముగ్గురు స్పెషలిస్టు వైద్యులుండేలా చర్యలు తీసుకున్నారు. గైనకాలజిస్ట్, జనరల్ మెడిసిన్, చిల్డ్రన్ స్పెషలిస్ట్ ప్రధానంగా ఉంటారు. ఈ ముగ్గురితో పాటు కంటికి సంబంధించిన డాక్టర్ ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. జిల్లాలో 553 సురక్ష క్యాంపులు జరగనున్నాయి. వీటిలో 58 పీహెచ్‌సీ డాక్టర్లు, క్యాంపునకు ఇద్దరు చొప్పున్న స్పెషలిస్టు డాక్టర్లు, 3 వేల మందికి పైగా పారామెడికల్ సిబ్బంది పాల్గొననున్నారు. ప్రతి ఆరు మండలాలకు ఒక నోడల్ అధికారిని నియమించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రైవేటు ఆస్పత్రుల వైద్యులను ఇందులో భాగస్వాములు చేశారు. దీంతో పేద ప్రజలకు వాడవాడాల వైద్య సేవలు అందుతున్నాయి. ముఖ్యంగా గర్భిణులు, వృద్ధులు, చిన్నపిల్లలకు హెల్త్ క్యాంపులు ఉపయోగపడుతున్నాయి.

తండ్రిలాగే



సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తండ్రి వైఎస్సార్ బాటలో పయనిస్తున్నారు. పేదల ఆరోగ్య బాగోగులను చూసుకుంటున్నారు. డాక్టర్లను ఏదో రకంగా ఊర్లోకే రప్పిస్తున్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులు మాకు ఎంతో ఉపయోగపడుతున్నాయి. ఊర్లోనే పరీక్షలు చేస్తున్నారు. నాకున్న కంటి సమస్యను ప్రారంభ దశలో గుర్తించడానికి ఈ కార్యక్రమం దోహదపడింది.

-త్రిపుర సుందరి, జీడీనెల్లూరు

మొదటి విడత ఆరోగ్య సురక్ష వివరాలు

క్యాంపుల సంఖ్య 440	ఓపీల సంఖ్య 1,82,919
రెఫర్ కేసులు 4,005	ఓపీల సంఖ్య 1,82,919
రక్తహీనత 70,025	బీపీ కేసులు 9,943
మధుమేహ కేసులు 7,821	కంటి వెలుగు పరీక్షలు 33,303
కళ్ల అద్దాలు తీసుకున్నవారు 14,199	కంటి ఆపరేషన్ చేసుకున్నవారు 224

రెండో విడత ఆరోగ్య సురక్ష వివరాలు

క్యాంపుల సంఖ్య 553	ఇప్పటి వరకు పూర్తయిన క్యాంపులు 11
ఓపీలు 3,502	పురుష ఓపీలు 1,586
స్త్రీల ఓపీ 1,916	కంటి వెలుగు స్కానింగ్ 309
రెఫర్ కేసులు 33	

పేదలకు వరం



జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు వరం. గతంలో ఎన్నడూ లేనివిధంగా వైద్య సేవలు అందుతున్నాయి. ఇంటి వద్దకే వచ్చి వైద్యపరీక్షలు చేస్తున్నారు. క్యాంపులు పెట్టి మందులు, మాత్రలు ఉచితంగా అందిస్తున్నారు. ముందు ఇలా లేదు. ఊర్లోనే క్యాంపులు పెట్టి చూస్తున్నారు.

-యమున, బలిజకండ్రిగ

ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నా



ఇటీవల మా ఊర్లో నిర్వహించిన జగనన్న ఆరోగ్య శిబిరంలో వైద్య పరీక్షలు చేయించుకున్నా. డాక్టర్లు మంచిగానే చూశారు. మందులు, మాత్రలు క్యాంప్ ఆవరణలోనే ఇచ్చిపంపారు. ఊరికి డాక్టరు రావడం ఎప్పుడూ చూడలేదు. మాలాంటి వాళ్లకు సురక్ష కార్యక్రమం ఎంతో ఉపయోగకరం.

-పంకజ్, గుడిపాల

కంటి అద్దాలు ఇచ్చారు



కంటి సమస్య ఉందని జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంపుకు వెళ్లాను. అక్కడి డాక్టర్లు పరీక్షించారు. కంటి సమస్య ఉందని స్కానింగ్ చేశారు. తర్వాత కంటి అద్దాలు ఇచ్చారు. దీనికి రూపాయి కూడా ఖర్చు కాలేదు. అక్కడ ఇక్కడ తిరగాల్సిన పనిలేదు. ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లి ఉంటే రూ.వేలల్లో ఖర్చు అయ్యేది.

-నస్రీన్, ఐరాల

పల్లెకొచ్చి సేవ చేస్తున్నారు



ముందు చిన్న జబ్బు వచ్చినా పట్టణానికి పరుగులు పెట్టేవాళ్లం. దుడ్డు ఉండే వాళ్లు ప్రైవేటు ఆస్పత్రికి.. పేదలు పెద్దాస్పత్రికి వెళ్లేవాళ్లం. ఇప్పుడు ఊరికొచ్చి పేదల బాగోగులను చూసుకుంటున్నారు. కంటి సమస్య ఉందని చూపించుకోవాలని వెళ్లా. పరీక్షించి కళ్ల అద్దాలు ఇచ్చారు.

-హేమచంద్ర, బంగారుపాళ్యం

కళ్లద్దాలు ఇచ్చారు



రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహిస్తున్నారని తెలియగానే క్యాంపు వద్దకు వెళ్లి ఉచిత కంటి పరీక్షలు చేయించుకున్నా. ఐదు రోజుల్లోనే ఉచితంగా కళ్లద్దాలు అందజేశారు. ఇప్పుడు కంటి చూపు బాగా కనపడుతోంది. సీఎంకి ధన్యవాదాలు.

-దొరస్వామి, మద్దులయ్యగారిపల్లి, పూతలపట్టు మండలం

కలిసొచ్చిన ఈ కాలం.. వరమిచ్చిన ఉల్లాసం!



తిరుపతిలో పెంచిన పింఛన్ల పంపిణీ బహిరంగ సభలో మాట్లాడుతున్న టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, పక్కన సమన్వయకర్త అభినయ్‌రెడ్డి



మనవడు అభినయ్‌కి ఆశీర్వాదం



ముఠి'పెంచావ్' మనవడా!

ఆశీర్వదించండి..అండగా ఉంటాం



పెన్షన్ కార్డులు చూపుతున్న లబ్ధిదారులు

తిరుపతి నగరంలోని పోస్టల్ కాలనీలో గురువారం పింఛన్ల పంపిణీ బహిరంగ సభ నిర్వహించారు. కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే, టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త, డెప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి, మేయర్ శిరీష తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు పెంచిన రూ.3 వేల పింఛన్లు పంపిణీ చేశారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో తమ మనోభావాలను లబ్ధిదారులు పంచుకున్నారు. సీఎం జగన్ లాంటి బిడ్డ అధికారంలో ఉంటే కన్నబిడ్డలు చూడకపోయినా సంతోషంగా బతికేయొచ్చని చెప్పారు. ఇచ్చిన మాటకు కట్టుబడి రూ.3 వేలు పింఛన్ అందజేస్తున్నందుకు ఆనందంగా ఉందన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ జగన్‌మోహన్‌రెడ్డే ముఖ్యమంత్రి కావాలని ఆకాంక్షించారు. - తిరుపతి మంగళం

వసతులతోపాటు రాబడి పెంచాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్టీసీ ఈడీ కోటేశ్వరరావు

తిరుపతి అర్బన్: ప్రయాణికులకు మెరుగైన వసతులు కల్పించడంతో పాటు ఆర్టీసీకి రాబడి పెంచేదిశగా సిబ్బంది పనిచేయాలని రాష్ట్ర ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్(ఆపరేషన్స్) కోటేశ్వరరావు సూచించారు. తిరుపతి డీపీటీవో కార్యాలయంలో గురువారం ఆయన జిల్లా స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆధ్యాత్మిక కేంద్రమైన తిరుపతి నగరానికి భక్తులు వచ్చిపోతున్న నేపథ్యంలో తిరుపతి సెంట్రల్ బస్టాండ్‌లో మెరుగైన వసతులు కల్పించాలని ఆదేశించారు. ప్రధానంగా తాగునీరు, కొళాయిలు, పారిశుద్ధ్యం, కార్గో సరుకుల రవాణా తదితర అంశాలపై ప్రత్యేక ఫోకస్ పెట్టాలని సూచించారు. బస్సుల కండిషన్ ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలన్నారు. ఆర్టీసీ అందిస్తున్న రాయితీలపై పెద్దఎత్తున ప్రచారం చేయాలన్నారు. కడప జోన్ ఇన్‌చార్జి ఈడీ చెంగల్‌రెడ్డి మాట్లాడుతూ తిరుపతి జిల్లాలోని 11 డిపోల పరిధిలో ఆర్టీసీ సర్వీసులను సమర్థవంతంగా నడుపుతున్నట్లు చెప్పారు. డెప్యూటీ చీఫ్ మెకానిక్ ఇంజినీర్ నరసింహులు, పర్సనల్ ఆఫీసర్ ఎం.పార్థసారథి, అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ రామచంద్రనాయుడు పాల్గొన్నారు.

సంక్రాంతి సెలవుల్లో ఎలాంటి మార్పుల్లేవు

చిత్తూరు కలెక్టరేట్ : పాఠశాలలకు సంక్రాంతి సెలవుల్లో ఎలాంటి మార్పులు లేవని డీఈఓ విజయేంద్రరావు అన్నారు. ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర విద్యాశాఖ అధికారులు జారీ చేసిన అకడమిక్ క్యాలెండర్ ప్రకారం ఈ నెల 9వ తేదీ నుంచి 18వ తేదీ వరకు పాఠశాలలకు సంక్రాంతి సెలవులు ఉంటాయన్నారు. పాఠశాలలకు ఈ నెల 8న చివరి పనిదినం అని చెప్పారు. పాఠశాలలు ఈ నెల 19 పునఃప్రారంభించాలని తెలిపారు. తప్పుడు ప్రచారాలను నమ్మకూడదని డీఈఓ స్పష్టం చేశారు.

ఉప్పొంగిన అభిమానం

- పాకాలలో చెవిరెడ్డి మోహిత్‌రెడ్డికి కార్లతో భారీ స్వాగతం

పాకాల: వైఎస్సార్‌సీపీ చంద్రగిరి నియోజకవర్గ సమన్వయకర్తగా నియమితులై మండలానికి మొదటి సారి విచ్చేసిన తుడా చైర్మన్, చంద్రగిరి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డికి ఘన స్వాగతం లభించింది. కార్లతో ర్యాలీగా వచ్చి ఆత్మీయంగా స్వాగతం పలికారు. గురువారం వైఎస్సార్‌సీపీ నాయకుల ఆధ్వర్యంలో నేంద్రగుంట నుంచి పాకాల, ఊట్లవారిపల్లి, బందార్లపల్లి మీదుగా దామలచెరువు వరకు ర్యాలీ సాగింది. మోహిత్‌రెడ్డి నాయకత్వం వర్ధిల్లాలి అంటూ నినాదాలు హోరెత్తించారు. అంతకముందు మండల పార్టీ నాయకులు మోహిత్‌రెడ్డికి శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలు అందించి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మోహిత్‌రెడ్డి మాట్లాడుతూ యువత రాజకీయాల్లో రాణించాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి తనను చంద్రగిరి నియోజవర్గ పార్టీ సమన్వయకర్తగా అవకాశం కల్పించారని గుర్తుచేశారు. తనకు అప్పగించిన బాధ్యతలను క్రమశిక్షణతో నిర్వర్తిస్తూ.. చంద్రగిరి ఎమ్మెల్యే డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి అడుగుజాడల్లో నడుస్తూ ప్రజాభిమానాన్ని చూరగొంటానని తెలిపారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ లోకనాథం, పార్టీ కన్వీనర్ నంగా నరేష్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షులు హరిప్రసాద్‌రెడ్డి, కపిలేశ్వర్‌రెడ్డి, భాస్కర్‌నాయుడు, స్టేట్ బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ రఘుపతి, లింగయ్యనాయుడు, రహీం, లోకనాథరెడ్డి పాల్గొన్నారు.



మోహిత్‌రెడ్డిని స్వాగతిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



కార్లతో భారీ ర్యాలీ

ఉరి వేసుకుని యువకుడి ఆత్మహత్య


మృతుడు వెంకటరమణ(ఫైల్)

రేణిగుంట: రేణిగుంట పాంచాలినగర్‌కు చెందిన ఓ యువకుడు ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని మృతి చెందినట్లు రేణిగుంట సీఐ సుబ్బారెడ్డి తెలిపారు. ఆయన కథనం.. సదుం మండలం, గొల్లవాండ్లపల్లికి చెందిన వెంకటప్ప, అలిమేలమ్మ కుమారుడు వెంకటరమణ(32), రాయచోటికి చెందిన సహదేవు కుమార్తె నాగజ్యోతితో పదేళ్ల కిందట ప్రేమ వివాహం చేసుకున్నారు. వీరికి మేఘచైతన్య(10), నందన్ కిట్టు(3) ఇద్దరు పిల్లలు. వెంకటరమణ మెడ్ ఫార్మా కంపెనీలో పనిచేస్తుండగా, అతని భార్య నాగజ్యోతి రేణిగుంట విమానాశ్రయంలో కాంట్రాక్టు కార్మికురాలిగా పనిచేస్తోంది. తొమ్మిదేళ్లపాటు తిరుపతిలో నివాసముండి, ఏడాది కిందట రేణిగుంట పాంచాలినగర్‌లో బాడుగ ఇంట్లో చేరారు. వీరి మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. గతంలో పలు దఫాలు పోలీస్ స్టేషన్ వరకు వచ్చి కౌన్సెలింగ్ చేసిన సందర్భాలున్నాయి. ఈ క్రమంలో బుధవారం రాత్రి వెంకటరమణ మద్యం తాగి వచ్చి భార్యతో గొడవకు దిగాడు. తాను చనిపోతానని ఉరివేసుకునేందుకు వెంకటరమణ ప్రయత్నించాడు. ఆ తర్వాత భార్య నిద్రపోయాక, వెంకటరమణ ఫ్యాన్‌కు ఉరి చేసుకుని తనువు చాలించాడు. మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకుని పంచనామా నిమిత్తం తిరుపతి ఎస్వీ వైద్యకళాశాలకు తరలించారు. మృతుని భార్య నాగజ్యోతిని విచారించారు. కేసు దర్యాప్తులో ఉంది.

సంక్షేమ సారథికి మళ్లీ పట్టం కడదాం

- పింఛనుదారులకు మంత్రి పెద్దిరెడ్డి పిలుపు
- ఇచ్చిన మాటకు కట్టుబడి పింఛన్ రూ.3 వేలు చేసిన సీఎం
- ఇప్పటివరకు పింఛన్ వ్యయం రూ.83,556 కోట్లు


లబ్ధిదారులకు మెగా చెక్కు అందిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్యే శ్రీనివాసులు, కలెక్టర్ షణ్మోహన్, ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి

సాక్షి, చిత్తూరు: చరిత్రలో కనీవినీ ఎరుగని రీతిలో పథకాలు అమలు చేస్తున్న సంక్షేమ సారథి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి మళ్లీ పట్టం కడదామని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. నగరంలోని స్థానిక నాగయ్య కళాక్షేత్రంలో గురువారం వైఎస్సార్ పింఛన్ల కానుక పంపిణీ జిల్లా స్థాయి కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మంత్రి ప్రసంగించారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన మాట ప్రకారం అవ్వాతాతలకు రూ.3వేలు పింఛన్ అందిస్తున్నారని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా జనవరి 8 వరకు పింఛన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ముఖ్యమంత్రి ఇచ్చిన హామీల్లో 99.5 శాతం నెరవేర్చారన్నారు. కరోనా విపత్కర పరిస్థితుల్లో కూడా సంక్షేమ పథకాలను పకడ్బందీగా అమలు చేశారని గుర్తుచేశారు. పేదరికాన్ని మాత్రమే అర్హతగా నిర్ణయించి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని చెప్పారు. సంక్షేమ పథకాల అమలుతోపాటు జిల్లాలో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టామన్నారు. గత ఐదేళ్లలో రాష్ట్ర వ్యాప్తంగా రూ.83,556 కోట్లు పింఛన్ల కోసం ఖర్చు చేశామన్నారు. పేదవారి సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకునే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన సాగిస్తున్నారని స్పష్టం చేశారు. పాడి రైతులను ఆదుకునే విధంగా పాల మద్దతు ధరను పెంచామన్నారు. గతంలో పేదలను పట్టించుకోని చంద్రబాబు జన్మభూమి కమిటీలు పెట్టుకుని, పార్టీ కార్యకర్తలకు, బంధువులకు అన్ని పథకాలు కట్టబెట్టారని గుర్తుచేశారు. ఎన్నికల సమయంలో మాత్రమే చంద్రబాబుకు ప్రజలు గుర్తుకువస్తారని ఎద్దేవా చేశారు. రానున్న ఎన్నికల్లో కూడా సీఎంగా జగన్‌కు అండగా నిలవాలని, కుప్పంతోపాటు జిల్లాలోని అన్ని స్థానాల్లో గెలిపించాలని మంత్రి పెద్దిరెడ్డి కోరారు. సమావేశంలో చిత్తూరు మేయర్ అముద, డీఆర్‌ఓ ఎన్.రాజశేఖర్, రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ చైర్మన్ బి.సురేష్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ జోనల్ చైర్ పర్సన్ శైలజా రెడ్డి, జెడ్పీ సీఈఓ ప్రభాకర్ రెడ్డి, డీఆర్‌డీఏ, మెప్మా పీడీలు తులసి, రాధమ్మ, నగరపాలక సంస్థ కమిషనర్ అరుణ, డిప్యూటీ మేయర్లు చంద్ర శేఖర్, రాజేష్ కుమార్ రెడ్డి, మాజీ టీటీడీ బోర్డు సభ్యులు పోకల అశోక్ కుమార్, సహాయ కమిషన్ గోవర్ధన్, కౌన్సిలర్స్, ప్రజా ప్రతినిధులు, మహిళలు పాల్గొన్నారు.

66లక్షల మందికి పింఛన్
పేదల కష్టం విన్నాను, నేను ఉన్నాను అని చెప్పిన విధంగా పేదలను సంక్షేమ పథకాలద్వారా ఆదుకుంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం 66 లక్షల మందికి పింఛన్ల రూపంలో నెలకు దాదాపు రూ.2 వేల కోట్లు ఖర్చు చేస్తోంది. ఇచ్చిన మాటకు కట్టుబడి ముఖ్యమంత్రి అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారు. – గోవిందప్ప శ్రీనివాసులు, జెడ్పీ చైర్మన్

నవరత్నాలతో నవశకం
దేశంలో పేదల గురించి ఆలోచిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి. ఆయన అధికారంలోకి వచ్చిన వెంటనే నవరత్నాల పథకాలను ప్రవేశపెట్టి నవశకానికి నాంది పలికారు. సంక్షేమ పథకాల ద్వారా అన్ని వర్గాలకు చెందిన ప్రతి పేద కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకుంటున్నారు. మహిళల పేరు పైన సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారు. –ఎస్.రెడ్డెప్ప, చిత్తూరు ఎంపీ

పింఛన్‌కు గొప్ప స్థానం
వృద్ధాప్య పింఛన్ కింద ప్రతి సంవత్సరం పెంచుతూ ఈ సంవత్సరం రూ.3 వేలు అందించాము. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలలో పింఛన్ కానుకకు ఒక గొప్ప స్థానం ఉంది. ఈ ఆర్థిక సహాయం వృద్ధులకు, దివ్యాంగులు, వితంతువుల వైద్య అవసరాలకు, రోజువారీ అవసరాలకు ఎంతో ఉపయోగకరం. అర్హులందరికీ పెన్షన్ అందుతుంది. – ఎస్.షణ్మోహన్, జిల్లా కలెక్టర్

నియోజకవర్గంలో 30 వేల మంది
గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం కోసం సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేశాం. దేశంలోనే విద్య, వైద్యం, సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు సమపాళ్లలో అమలు చేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి. చిత్తూరు నియోజకవర్గంలో దాదాపు 30వేల మందికి పెన్షన్ అందిస్తున్నాము. నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేశాం. – ఆరణి శ్రీనివాసులు, చిత్తూరు ఎమ్మెల్యే

ఇంటి వద్దకే..
ముఖ్యమంత్రి ఇచ్చిన మాట ప్రకారం అవ్వాతాతలకు రూ.3వేలు పింఛన్ అందుతోంది. వలంటీర్ల వ్యవస్థ ద్వారా పింఛన్‌ను లబ్ధిదారుల ఇంటి వద్దకే చేరవేస్తున్నాం. ఇచ్చిన మాట తప్పని ఏకైక ముఖ్యమంత్రి సీఎం జగన్ మాత్రమే. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారు. – విజయానందరెడ్డి, ఆర్టీసీ వైస్ చైర్మన్

నేడు వెంకటగిరిలో సామాజిక సాధికార యాత్ర

- వెంకటగిరి నుంచి డక్కిలి మీదుగా రాపూరు వరకు ర్యాలీ
- అనంతరం భారీ బహిరంగ సభ
- హాజరు కానున్న ప్రజాప్రతినిధులు
- ఏర్పాట్లు పూర్తి


స్టేజీని కడుతున్న దృశ్యం (ఇన్‌సెట్) నేదురుమల్లి

సైదాపురం: వైఎస్సార్‌సీపీ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సామాజిక సాధికారక బస్సుయాత్ర శుక్రవారం వెంకటగిరి నియోజకవర్గంలో జరగనుంది. వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసినప్పటి నుంచి నేటి వరకు 56 నెలలు పాలనలో జరిగిన సామాజిక న్యాయం బడుగు, బలహీన వర్గాలకు అందించిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి గురించి ప్రజలకు వివరించడమే ఈయాత్ర ప్రధాన ఉద్దేశం. ఈ యాత్రకు వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షులు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో జరగనున్న ఈ యాత్రకు పలువురు నేతలు, నియోజకవర్గాల ఇన్‌చార్జ్‌లు, అభిమానులు పెద్ద ఎత్తున తరలిరానున్నారు.

సాధికార యాత్రను విజయవంతం చేయండి.

సామాజిక సాధికార యాత్రను జయప్రదం చేయాలని నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. యాత్ర ఏర్పాట్లను ఆయన గురువారం పర్యవేక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శుక్రవారం మధ్యాహ్నం ఒంటి గంటకు నేదురుమల్లి బంగ్లా నుంచి ర్యాలీ ప్రారంభమవుతుందన్నారు. అనంతరం పోలేరమ్మ ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేసి డక్కిలి మీదుగా రాపూరులో జరిగే బహిరంగ సభ వరకు ర్యాలీ ఉంటుందని వెల్లడించారు. నియోజకవర్గంలోని వెంకటగిరి, బాలాయపల్లి, రాపూరు, కలువాయి, డక్కిలి, సైదాపురం మండలాలకు చెందిన ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు ప్రజలు హాజరై యాత్రను విజయవంతం చేయాలని కోరారు. ఆయన వెంట జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షులు నెమళ్లపూడి సురేష్‌రెడ్డి, పాపకన్ను మధుసూదన్‌రెడ్డి, ఢిల్లీబాబు, నక్కా భానుప్రియ, దొంతుశారద, చిట్టేటి హరికృష్ణ, బాలయ్య, ఎల్.కోటేశ్వరరావు పాల్గొన్నారు.

భారీ ఏర్పాట్లు

సామాజిక సాధికార బస్సు యాత్ర నేపథ్యంలో భారీ ఏర్పాట్లు చేపట్టారు. వెంకటగిరి నుంచి రాపూరు వరకు సుమారు 20 కిలోమీటర్ల దూరం వరకు అడుగుఅడుగునా వైఎస్సార్‌సీపీ జెండాలు, తోరణాలు, బ్యానర్లు, కటౌట్లు ఏర్పాటు చేశారు.

వెంకటగిరి నియోజకవర్గంలో సామాజిక న్యాయం

వైఎస్సార్‌సీపీ పాలనలో వెంకటగిరి నియోజకవర్గంలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు ప్రాధాన్యత కల్పించారు. రెండేళ్లపాటు రాష్ట్ర సంగీత నృత్య అకాడమీ చైర్‌పర్సన్‌గా పొట్టేళ్ల శిరిషా(బీసీ)ను ఎంపిక చేశారు. జిల్లా గ్రంథాలయ చైర్‌పర్సన్‌గా దొంతు శారద (బీసీ), వెంకటగిరి మున్సిపల్ చైర్‌పర్సన్‌గా నక్కా భానుప్రియ (బీసీ), రాష్ట్ర చేనేత కార్పొరేషన్ డైరెక్టర్‌గా నక్కా వెంకటేశ్వర్లు (బీసీ), జిల్లాపరిషత్ ఉపాధ్యక్షరాలుగా చిగురుపాటి ప్రసన్న(ఎస్సీ), వెంకటగిరి మున్సిపాలిటీ ఉపాధ్యక్షుడిగా సేతురాశి బాలయ్య(ఎస్సీ)కు కేటాయించారు. పార్టీ జిల్లాకార్యదర్శిగా చిట్టేటి హరికృష్ణ(ఎస్సీ)ను ఎంపిక చేశారు. సైదాపురం ఎంపీపీగా పెంచలమ్మ(ఎస్టీ), వైస్ ఎంపీపీలుగా భాస్కర్ (బీసీ), మరో వైస్ ఎంపీపీగా ఈశ్వరమ్మ (ఎస్సీ)కు కేటాయించారు. సైదాపురం వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షులుగా బీసీ వర్గానికి చెందిన మన్నారపు రవికుమార్‌ను నియమించారు.


నేతలతో సమీక్షిస్తున్న, నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

శ్రీవారి సేవలో ప్రముఖులు


శ్రీవారి ఆలయం ఎదుట సినీ నటుడు శ్రీకాంత్


ఐఏఎస్ అధికారిణి రోహిణి సింధూరి

తిరుమల: తిరుమల శ్రీవారిని గురువారం సినీ నటుడు శ్రీకాంత్ కుటుంబ సమేతంగా, ఐఏఎస్ అధికారిణి రోహిణి సింధూరి దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనానంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా.. టీటీడీ అధికారులు ఘనంగా లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

రోడ్డు ప్రమాదంలో సైకిలిస్ట్ మృతి


మృతిచెందిన ముత్యాలయ్య

గూడూరు రూరల్: గూడూరు రూరల్ పరిధిలోని జాతీయ రహదారి, చిల్లకూరు సర్వీసు రోడ్డులో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందారు. రూరల్ ఎస్ఐ.మనోజ్‌కుమార్ వివరాల మేరకు.. చిల్లకూరు అరుంధతీయవాడకు చెందిన మంగళపూరి ముత్యాలయ్య(49) కూలి పనుల నిమిత్తం ఇంటి నుంచి సైకిల్‌పై బయలుదేరాడు. చిల్లకూరు సర్వీసు రోడ్డులో వెనుక నుంచి ఆటో ఢీకొనడంతో తలకు తీవ్ర గాయమైంది. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం గూడూరు ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ ముత్యాలయ్య మృతిచెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

సిద్ధార్థలో ముందస్తు సంక్రాంతి సంబరాలు



అధ్యాపకులతో కలిసి కేక్ కట్‌చేస్తున్న అశోకరాజు, సంక్రాంతి సంబరాలలో అశోకరాజు, అధ్యాపకులు

నారాయణవనం: సిద్ధార్థ గ్రూప్ ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాలల్లో ముందస్తు సంక్రాంతి సంబరాలను సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. గురువారం ముగ్గులు, ఆటల పోటీలను నిర్వహించి, బహుమతులను ప్రదానం చేశారు. మధ్యాహ్నం ఆడిటోరియంలో జరిగిన సమావేశంలో కళాశాలల చైర్మన్ డాక్టర్ అశోకరాజు మాట్లాడుతూ దక్షిణాది రాష్ట్రాల గ్రామాలలో భక్తిశ్రద్ధలతో నాలుగు రోజుల పాటు జరుపుకునే సంక్రాంతి పడుగ మన సంప్రదాయానికి ప్రతీకగా నిలుస్తోందన్నారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలతో సాంకేతిక విద్యను అందించడానికి కృషి చేస్తామని స్పష్టం చేశారు. తమ కళాశాలలో చదువుతున్న ప్రతి విద్యార్థికీ మంచి భవిష్యత్‌ను అందివ్వడానికి అహర్నిశలు శ్రమిస్తున్నట్లు తెలిపారు. అనంతరం అశోకరాజు అధ్యాపకులు, విద్యార్థుల మధ్య కేక్‌ను కట్ చేసి తన జన్మదిన వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కళాశాలల డైరెక్టర్ సుబ్బరాజు, ప్రిన్సిపాళ్లు చంద్రశేఖర్‌రెడ్డి, జనార్దనరాజు, రమేష్, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, పాల్గొన్నారు.

తోడేళ్లు వస్తున్నాయ్ తస్మాత్ జాగ్రత్త!

నాయుడుపేట: ముసుగు వేసుకున్న తోడేళ్లలాగా టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు, దత్తపుత్రుడు పవన్‌కళ్యాణ్ వస్తున్నారని, వారి మాయమాటలకు మోసపోవద్దని స్థానిక ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ప్రజలకు సూచించారు. గురువారం నాయుడుపేట స్త్రీ శక్తి భవన్‌లో పెంచిన పెన్షన్‌ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. గత నెలలో రూ.2,750 పింఛన్ వచ్చేదని, జనవరి నుంచి ప్రతి పెన్షన్ దారుడికి రూ.3 వేలు అందించనున్నట్టు తెలిపారు. నాయుడుపేట మండలంలో కొత్తగా మంజూరైన పెన్షన్‌లు 54తో పాటు పాత పెన్షన్‌లు 5,114 మొత్తం 5,168 పెన్షన్‌లకు దాదాపు రూ.1.55 కోట్ల నగదు పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. గుంట నక్కలాగే కాపుకాసి ప్రజలను మోసం చేసే గుణం టీడీపీకి ఉందని, ఇచ్చిన మాట తప్పే ఏకైక నాయకుడు చంద్రబాబు నాయుడని అభివర్ణించారు. ప్రజలను మోసం చేయడంలో ఆయన కంటే దిట్ట ఎవరూలేరని. అందుకు మద్దతుగా దత్త పుత్రుడు జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ ముందుకు వస్తున్నారని విమర్శించారు. రాష్ట్ర ప్రజలు వైఎస్సాఆర్‌కాంగ్రెస్ పార్టీ వెంట ఉన్నారని, ఎన్ని తోడేళ్లు వచ్చినా ప్రజాబలాన్ని ఏమీ చేయలేవని తెలిపారు. 2024 ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. అనంతరం పలువురు లబ్ధిదారులకు పెంచిన పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కురుగుండ ధనలక్ష్మి, మండల పార్టీ అధ్యక్షులు తమ్మిరెడ్డి సుబ్రమణ్యంరెడ్డి, కామిరెడ్డి రాజారెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ గందవల్లి సిద్ధయ్య, ఈద రత్నశ్రీ, జలదంకి విజయబాబు, చంద్రారెడ్డి, ఎంపీడీవో శివప్రసాద్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.